క్లుప్తంగా

ఆకట్టుకున్న రంగవల్లుల పోటీలు



కోటనందూరులో మహిళలకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ నారాయణ

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిర్వహించిన రంగవల్లుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు యోగాంధ్రపై అవగాహన కల్పిస్తూ రంగురంగుల ముగ్గులు వేశారు. ఈ పోటీల్లో కోటనందూరుకు చెందిన ఎద్దు రత్నం ప్రథమ, పంపన బోయిన నాగసీత ద్వితీయ, అల్లిపూడికి చెందిన లాలం జగదీశ్వరి తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఎంపీడీఓ వెంకటనారాయణ బహుమతి ప్రదానం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో యోగాంధ్ర ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ ఎస్.జయరాం, ఎంఈఓ మామిడి రామశేఖర్, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

లవకుమార్‌కు చిరుకూరి సత్కారం



ములగపూడిలో లవకుమార్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకుడు చిలుకూరి రామ్‌కుమార్

రౌతులపూడి: ఇటీవల యూపీఎస్సీ విడుదల చేసిన ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారెస్టు సర్వీసు) పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ములగపూడికి చెందిన చింతకాయల లవకుమార్‌ను బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ సత్కరించారు. మంగళవారం ములగపూడిలోవున్న లవకుమార్ స్వగృహానికి వెళ్లి తల్లిదండ్రులు వీరసత్యచక్రవర్తి, వరహాలు దంపతులకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందనందించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులందరికీ శాలువాలు కప్పి సత్కరించారు. లవకుమార్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థీ ఉన్నత చదువుల్లో రాణించాలని కోరారు. గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో విద్యాబుద్ధులు అలవర్చుకుని అకుంఠిత దీక్ష, పట్టుదలతో కోచింగ్ లేకుండా ఉన్నతస్థాయి పరీక్షల్లో ఎంపికవ్వటం గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు లవుడు శ్రీను, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన



కోటనందూరులో కిశోరి వికాసంపై అవగాహన కల్పిస్తున్న బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రీనివాసరావు

కోటనందూరు: కోటనందూరు, అల్లిపూడి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం కిశోర వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో బాలిక విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రుతుక్రమ పరిశుభ్రత, బాల్య వివాహాలు, పోక్సో చట్టం, ఆత్మరక్షణ, వృత్తివిద్య, జీవనోపాధి అవకాశాలు తదితర అంశాలపై అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. కిశోరి వికాశంపై బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. బాలల సంరక్షణ విభాగం అధికారి శ్రీనివాసరావు, అంగన్వాడీ సిబ్బంది, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

ఏలేశ్వరం:	
తహసీల్దార్	- 98499 03921
ఎండీపీఓ కార్యాలయం	- 98493 36599
ఎంఈఓ	- 94942 10420
ఏపీఓ	- 70939 98217
ఏపీఎం	- 73373 16825
ఎస్సై	- 94409 04835
మండల వైద్యాధికారి	- 99662 06287
నగర పంచాయతీ కమిషనర్	- 96520 65430
మండల వ్యవసాయాధికారి	- 83310 56609
ఫారెస్టు రేంజర్	- 94403 28540
కిర్లంపూడి:	
తహసీల్దార్	- 98499 03886
ఎంపీడీఓ	- 91009 70617
ఎంఈఓ	- 90009 12335
ఎంఈఓ-2	- 98487 43433
ఏపీఓ	- 83744 46309
ఏపీఎం	- 96523 04151
ఎస్సై	- 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	- 77024 41029
వీరవరం వైద్యాధికారి	- 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	- 81066 28018
మండల వ్యవసాయాధికారి	- 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	- 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	- 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	- 89789 41840
హౌసింగ్ ఏఈ	- 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	- 97014 77778

బాబూ ఎక్కడ ఎన్నికల హామీలు

- తునికి ఇచ్చిన ఒక్క హామీ అమలు కాలేదు
- కూటమి వైఫల్యంపై నేడు వైఎస్సార్ సీపీ నిరసనలు

తుని: అధికారంలో రావడానికి ప్రజలకు హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చాక మరిచిపోవడం టీడీపీకి వెన్నతో పెట్టిన విద్యనే. రాజకీయాల్లో అధికారమే పరమావధిగా నడుస్తున్న ఏకైక పార్టీ టీడీపీగా చెప్పవచ్చు. దానికి నిదర్శనంగా 2014 నుంచి 2024 వరకు కాపులను బీసీల్లో చేర్చుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలుజేయకపోగా కాపులు ఉద్యమం చేస్తే కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారు. 2019 ఎన్నికల్లో ప్రజలు టీడీపీ మోసాలను గమనించి ప్రజలు వైఎస్సార్ సీపీకి అధికారం కట్టబెట్టారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ సీపీ ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసింది. 2024లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కట్టడంతో ప్రజలు తిరుగులేని మెజార్టీతో గెలిపించారు. కూటమి సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించి పింఛన్ తప్ప వేరేదీ ఇప్పటి వరకు అమలు చేయలేదు. దీంతో నమ్మి ఓట్లు చేసిన ప్రజలను నట్టేట ముంచారని, ఏడాది పాలనలో ప్రజలకు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్ సీపీ బుధవారం నిరసన కార్యక్రమం చేపడుతోంది.

తునికి ఇచ్చిన హామీలు:

ఎన్నికల సమయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్, నారా లోకేష్‌లు తునిలో పర్యటించారు. తుని, పాయకరావుపేట ప్రజలకు వరద రూపంలో ఇబ్బంది పెడుతున్న తాండవ నదికి కరకట్ట నిర్మాణం, యువతకు ఉద్యోగాల కోసం పారిశ్రామిక కారిడార్, తీర ప్రాంతంలో పరిశ్రమలు, తుని మున్సిపాల్టీకి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర హామీలను ఇచ్చారు. ఇందులో ఒక్కటి కూడా అమలు చేయలేదు. ఇక రైతులకు రైతు భరోసా, అమ్మఒడి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1,500 ఇలా అనేక పథకాలను ప్రకటించి అమలు చేయలేదు. ఇదే విషయాన్ని వైఎస్సార్ సీపీ ప్రజల ముందుకు తీసుకువెళ్లి కూటమి మోసపూరిత పాలనను వివరిస్తామన్నారు. కావున నేడు జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వ వైఖరిని అణచివేయాలన్నారు.



తునిలో ఉధృతంగా ప్రవహిస్తున్న తాండవ నది (ఫైల్)

జయప్రదం చేయండి

తుని: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కూటమి ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా మంగళవారం కోరారు. అధికారం కోసం అమలు సాధ్యం కాని హామీలను ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసగించారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేదన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, ఉచిత బస్సు తదితర హామీలను బుట్టదాఖలా చేశారని, అందుకే ప్రజలంతా వెన్నుపోటు దినోత్సవంగా గుర్తించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉదయం 9. గంటలకు స్థానిక ఆంజేయ స్వామి గుడి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, బాలాజీ సెంటర్, మెయిన్ రోడ్డు, గొల్ల అప్పారావు సెంటర్, జీఎస్‌టి రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెన్ను పోటు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని రాజా కోరారు.



మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

అదనపు కోర్టు మంజూరు చేయాలి

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు అనుబంధంగా అదనంగా మరో కోర్టు మంజూరు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం జిల్లా జడ్జిని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు కొల్లా వీర్రాజు, బార్ ప్రతినిధులు కె.శ్రీనివాసరావు, నాగేంద్రరాజు యార్లగడ్డ శ్రీనివాస్ తదితరులు రాజమహేంద్రవరంలో జిల్లా జడ్జి గంధం సునీతకు వినతిపత్రం అందజేసినట్టు బార్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు తెలిపారు. ప్రత్తిపాడులో అదనపు కోర్టు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను జిల్లా జడ్జికి వివరించగా, ఆమె సానుకూలంగా స్పందించారని రాజాల చిట్టిబాబు తెలిపారు.

నకిలీ ఎమ్మార్పీఎస్ చలామణి

గండేపల్లి: ఏపీ ఎమ్మార్పీఎస్ అని చెప్పుకుంటూ నకిలీ ఎమ్మార్పీఎస్ నాయకులు చలామణి అవుతున్నారని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ ఉత్తర కోస్తాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు, తదితరులు ఆరోపించారు. మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కొండేపూడి ఉదయ్ కుమార్ అనే వ్యక్తికి, తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఏపీ ఎమ్మార్పీఎస్ పేరుతో చేసే కార్యక్రమాలకు తాము దూరం అన్నారు. ఎంఈఎఫ్ నాయకులు గోరింట అబ్బులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో వెన్నుపోటు



గజ్జనపూడిలో బర్ల శ్రీను చక్రంను పరామర్శిస్తున్న కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలోని గజ్జనపూడిలో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామానికి చెందిన బర్ల శ్రీను చక్రం ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గిరిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా ప్రచారానికి ఇచ్చిన ఆర్భాటం హామీల అమలుకు చూపలేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటింటికీ అన్ని పథకాలను తీసుకువెళ్లారన్నారు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ ప్రతి ఇంటింటికీ పంపిణీ చేస్తే కూటమి ప్రభుత్వం ఆ వాహనాలను రద్దుచేసి ప్రజలకు కష్టాలు మిగిలిచిందన్నారు. పాత రేషన్ పద్ధతి ద్వారా రేషన్ సరకులను పంపిణీ చేస్తామని ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటు అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన పథకాలను రద్దు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ, గ్రామ సర్పంచ్ గోనగాలా అప్పలరాజు, పార్టీ నాయకులు గారా రమణ, బర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయరా..?

ప్రత్తిపాడు: కొత్త పింఛన్లు మంజూరు చేయాలన్న ధ్యాస ప్రభుత్వానికి ఉందా..ఎన్నికల హామీని గాలికి వదిలేశారా..? అన్ని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను ప్రశ్నిస్తున్నారు. ఎస్సీ, బీసీలకు 50 ఏళ్లు దాటితే పింఛన్లు మంజూరు చేస్తామంటూ కూటమి నేతలు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం గద్దెనెక్కిన ఏడాది అవుతున్నా కొత్త పింఛన్ల ఊసే లేదని ఆయన ఎద్దేవా చేశారు. యాభైఏళ్లు దాటిన ఎస్సీ, బీసీలకు పింఛన్లు మంజూరు చేయాలని కోరుతూ మంగళవారం ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబుకు కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ ఏడాది కాలంగా పింఛన్లు మంజూరును దాటవేత ధోరణిలో ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఎస్సీ, బీసీ పింఛన్లతో పాటు అర్హత కలిగిన అరవై ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని ఆయన కోరారు. దాసరి సత్తిబాబు, సూరిబాబు, సూరిబాబు, సత్తిబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు ఎంపీడీఓ కుమార్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

శంఖవరం: పరిసరాల పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికతీత తీయించారు. గ్రామం నలు మూలల బ్లీచింగ్, దోమల మందు పిచికారి చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్‌తో శుభ్రం చేశారు. అనంతరం సర్పంచ్ విజయదుర్గ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

ఉష్ణతాపంతో ఆపసోపాలు

- 41 డిగ్రీల ఉష్ణోగ్రతలతో అల్లాడిన ప్రజలు
- వడగాడ్పులకు తట్టుకోలేక అవస్థలు

సామర్లకోట: మూడు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. మే నెలలో వర్షాలు కురియడంతో ప్రజలు ఊరట చెందారు. ఆ ఊరటను పూర్తిగా ఆస్వాదించకముందే భానుడు మళ్లీ ప్రచండ తాండవం చేసేస్తున్నాడు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఆరు వరకు వేడిగాడ్పులతో ప్రజలు అల్లాడిపోయారు. దీనికి తోడు ఏదో ఒక సాకుతో విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో ప్రజలు అల్లాడిపోయారు. స్టేషన్ సెంటర్‌లోని మున్సిపల్ షాపులలోనికి నేరుగా ఎండ వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దాంతో నిత్యం రద్దీగా ఉండే స్టేషన్ సెంటర్, ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రాకపోకలు కనిపించలేదు. చిన్నారులు, వృద్ధులు వడగాడ్పులకు తాళలేక అస్వస్థతకు గురవుతున్నారు. జూన్ 10 వరకు ఎండ తీవ్రత ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అప్పటి వరకు పెళ్లిళ్ల జోరు ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఎండ దెబ్బకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు వారి విధులు పూర్తి చేసుకోవడానికి, వివాహాలకు ఎండను లెక్కచేయకుండా వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ప్రయాణికులు తెలియజేస్తున్నారు. దాంతో తలకు గుడ్డలు కప్పుకుని వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో వివిధ రకాల జ్యూస్‌లు, చెరుకు రసం, కొబ్బరి బొండాలకు డిమాండ్ ఏర్పడింది.



నిర్మానుష్యంగా మారిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి

మోడీ పాలనలో పెరిగిన ధరలు

ప్రత్తిపాడు రూరల్: ప్రధాని మోదీ పాలనలో దేశ వ్యాప్తంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు అన్నారు. మండలంలోని చింతలూరులో మంగళవారం అఖిలభారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజలకు సంబంధించిన సంక్షేమ పథకాలను ఎత్తివేయడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ అమలు చేయడంలో కూడమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కమిటీ సభ్యులు మానుకొండ లచ్చాబాబు, పార్టీ నాయకులు రేచుకట్ల సింహచలం, తాడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి ఇన్వర్టర్ బహూకరణ



తుని గ్రంథాలయానికి ఇన్వర్టర్‌ను అందిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక శాంతినగర్‌లోని జిల్లా గ్రంథాలయ శాఖకు రోటరీ క్లబ్ తరఫున ఇన్వర్టర్, బ్యాటరీని అందజేశామని తుని శాఖ అధ్యక్షుడు సీహెచ్.మంగరాజు తెలిపారు. మంగళవారం గ్రంథాలయంలో వీటిని రంగనాథరావుకు అందించారు. విద్యార్థులు పోటీ పరీక్షల కోసం ప్రిపరేషన్ అవుతుంటారని, కరెంట్ పోయినప్పుడు ఇబ్బందులు పడుతున్నారని గ్రంథాలయ అధికారి రంగనాధరావు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. విద్యార్థుల సౌలభ్యం కోసం ఇన్వర్టర్‌ను అందజేశామన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి ఎస్.వీర్రాజు, కోశాధికారి కిశోర్ రెడ్డి, డి.సత్యసాయి, ఎం.వివేకానంద, ఈశ్వర గణేష్, మోహనకృష్ణ, నాగభూషణం, నాగిరెడ్డి పాల్గొన్నారు.

తెలుగుపై పరిజ్ఞానం అవసరం

పెద్దాపురం: తెలుగు భాష, తెలుగుతనంపై విద్యార్థుల బాల్యం నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం తెలుగు పద్యాలు, నీతి కథలు, గణితం, పుస్తక సమీక్ష వంటి అంశాలపై సుమారు 30 మంది విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల సర్వే

ఏలేశ్వరం: భవిత కేంద్రంలో చేర్పించేందుకు ప్రత్యేక అవసరాల గల పిల్లల సర్వేను పట్టణంలో బుధవారం నిర్వహించారు. భవిత కేంద్రం టీచర్లు వాణి పద్మజ, బుజ్జి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన సెక్టార్ అంగన్వాడీ టీచర్ల సమావేశంలో సర్వేపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవులను పురస్కరించుకుని ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించామన్నారు. వీరిని భవిత కేంద్రంలో చేర్పించి విద్య అందిస్తామన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు చదువుతో పాటు పలు అంశాలపై శిక్షణ, ఫిజియో థెరపీ వంటి అంశాలపై శిక్షణ అందిస్తామన్నారు.



ఏలేశ్వరంలో అంగన్వాడీ సిబ్బందికి సర్వేపై వివరిస్తున్న భవిత టీచర్ వాణి పద్మజ

విద్యార్థులకు కళలపై శిక్షణ

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు వివిధ అంశాలు, కళలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడిరాము విద్యార్థులకు చిత్రలేఖనం, కథలు చదువడం, రాయడం, పద్యాలు చదివి భావాలు చెప్పుట, చిత్రలేఖనం, నృత్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెలవులను వృథా చేసుకోకుండా విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లీషు, మ్యాథ్స్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు.



ఏలేశ్వరం గ్రంథాలయంలో చిత్రలేఖనంలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించండి

- భూధాన భూముల కబ్జా
- తొమ్మిది మంది పెత్తందారుల దురాక్రమణ
- న్యాయం చేయాలంటున్న దళితులు

తుని రూరల్: కుమ్మరిలోవ పరిధిలోని దళితులు సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న కబ్జాదారుల నుంచి రక్షణ కల్పించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకుడు ఎల్.జనార్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం జనార్ధన్ ఆధ్వర్యంలో బాధితులు రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కిందట భూధాన భూములను కుమ్మరిలోవలో కొంతమంది దళితులకు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఆ భూముల్లో మామిడి, జీడిమామిడి సాగు చేసుకుంటు ఫలసాయంలో వచ్చే ఆదాయంతో దళితులు జీవనం సాగిస్తున్నారన్నారు. ఆ భూములకు తప్పుడు రికార్డులు సృష్టించి కబ్జా చేయడానికి గ్రామానికి చెందిన తొమ్మిది మంది పెత్తందారులు ప్రయత్నిస్తున్నట్టు ఆరోపించారు. దళితులు వేసిన చెట్లను నరికివేస్తుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న దళితులను కులం పేరుతో దూషించి, దుర్భాషలు ఆడారన్నారు. కబ్జాదారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. అధికారులు వెంటనే స్పందించి భూములకు, బాధిత దళితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలన్నారు. ఈ.లోవరాజు, బి.నాగమణి, వి.వెంకటరత్నం, జి.భవానీ, జి.రాజు, వి.ప్రవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సాగుభూములకు రక్షణ కల్పించాలని తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

అన్నదాతను ఆదుకునేవారేరీ?

- కొనుగోలుదారుల కోసం రైతన్న ఎదురుచూపు
- ముందుకు రాని మిల్లర్లు
- రూ.1200 ఇస్తామంటున్న దళారులు

సామర్లకోట: బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల వరుసగా కురిసిన వర్షాలకు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పట్టణ పరిధిలోని భీమవరం దిగువ ప్రాంతంలోని భూములను రైతులు కౌలు చేసుకుంటున్నారు. వర్షాల వల్ల ఆ ప్రాంతంలోని వరి పంట పడిపోయి నీట మునిగి, ధాన్యం తడిసి మొలకలొచ్చిన విషయం తెలిసిందే. వాతావరణంలో మార్పులతో నాలుగు రోజులుగా ఎండలు విపరీతంగా కాయడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా బస్తాకు రూ.1,725 చెల్లించాల్సి ఉంది. అయితే కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోళ్లకు ఎవరూ ముందుకు రావడం లేదని రైతులు మోకా నాయుడు, పిట్టా రాజు, ఎడ్ల కోటయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు రూ.1,200 చెల్లిస్తామని చెప్తున్నారని కౌలు రైతులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సహాయం అందజేయకపోగా పండించిన ధాన్యం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా చేస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ రాలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేశారని తెలిపారు. కౌలు రైతుల పరిస్థితిపై మండల వ్యవసాయాధికారి ఐ.సత్యను వివరణ కోరగా రైతులు ధాన్యం సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, ధాన్యం కొనుగోలు చేసే అధికారం తమకు లేదని, ఈ విషయాన్ని సివిల్ సప్లయ్ డీఎం దృష్టికి తీసుకువెళ్లి ధాన్యం కొనుగోలు చేసే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న కౌలు రైతులు